# నమస్తే తెలంగాణ

# హైదరాబాద్

హైదరాబాద్- మేడ్చల్

13 | హైదరాబాద్, మంగళవారం 20 ఫిబ్రవరి 2024 | HYDERABAD




సామాజికవేత్త సిద్ధారెడ్డిని అభినందిస్తున్న సోనూసూద్



బుక్‌ఫెయిర్‌లో పుస్తకాలను పరిశీలిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్, చిత్రంలో హెచ్‌బీఎఫ్ అధ్యక్షుడు జూలూరు గౌరిశంకర్ తదితరులు

సమస్య వస్తే ఫోన్ చేయండి..

## సాయం చేస్తా

### నటుడు సోనూసూద్

శంషాబాద్ రూరల్, ఫిబ్రవరి 19: సినిమాల్లో నటించి..కోట్లు సంపాదించినా రాని ఆనందం పేదలకు సేవ చేస్తేనే వస్తున్నదని ప్రముఖ సినీ నటుడు సోనూసూద్ అన్నారు. ఏదైనా సమస్య వస్తే ప్రజలు తనకు ఫోన్ చేయాలని, సాయం చేస్తానని చెప్పారు. సోమవారం శంషాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని సిద్ధాంతిలో సామాజికవేత్త సిద్ధూరెడ్డి తన సొంత డబ్బులతో అధునాతన ప్రభుత్వ పాఠశాల భవనాన్ని నిర్మించారు. ఈ భవనాన్ని నటుడు సోనూసూద్, ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్, నిర్మాత దాత సిద్ధూరెడ్డితో కలిసి ప్రారంభించారు. అనంతరం సోనూసూద్ మాట్లాడుతూ తనకు బాలీవుడ్ కంటే తెలుగు సినిమాలతోనే మంచి పేరు వచ్చిందన్నారు. కరోనా సమయంలో ప్రజలకు వచ్చిన ఇబ్బందులను చూసి చలించి పోయి.. సేవా కార్యక్రమాలు చేసినట్లు చెప్పారు. ప్రభుత్వ పాఠశాల భవనాన్ని తన సొంత ఖర్చులతో నిర్మించిన సిద్ధూరెడ్డిని ఆయన అభినందించారు. తెలంగాణలోని సర్కారు ఆస్పత్రుల్లో రోగులకు ఇబ్బందులు కలుగకుండా అవసరమైన వస్తువులు అందించేందుకు తాను సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు గణేశ్‌గుప్తా, మున్సిపల్ చైర్‌పర్సన్ సుష్మారెడ్డి, శంషాబాద్ మాజీ సర్పంచ్ రాచమల్ల సిద్ధేశ్వర్, వైస్ చైర్మన్ బండిగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

Telangana ప్రజావాణి

## ప్రజావాణిలో 82 దరఖాస్తుల స్వీకరణ

సిటీబ్యూరో, జనవరి 19 (నమస్తే తెలంగాణ) : జీహెచ్‌ఎంసీ పరిధిలో సర్కిల్ కార్యాలయాల్లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో మొత్తం 82 దరఖాస్తులను స్వీకరించినట్లు అధికారులు తెలిపారు. చార్మినార్ జోన్ నుంచి 3, సికింద్రాబాద్ 10, కూకట్‌పల్లిలో 29, శేరిలింగంపల్లిలో 29 దరఖాస్తులు వచ్చాయని చెప్పారు. ప్రజల నుంచి స్వీకరించిన దరఖాస్తులను వారంలోగా పరిష్కరిస్తామన్నారు.

## 39 ఎకరాలు లీజుకిచ్చిన ఆర్టీసీ

సిటీబ్యూరో, ఫిబ్రవరి 19 (నమస్తే తెలంగాణ) : గ్రేటర్ పరిధిలో ఆర్టీసీ భూముల లీజు వ్యవహారం చర్చనీయాంశంగా మారింది. ప్రభుత్వంలో ఆర్టీసీ విలీనాన్ని తీవ్రంగా వ్యతిరేకించడంతో పాటు, ఆర్టీసీ ఆస్తుల కోసం విలీనమంటూ.. ఆరోపణలు చేసిన కాంగ్రెస్ పార్టీ... అధికారంలోకి రాగానే... గ్రేటర్ పరిధిలో ఉన్న విలువైన భూములను ప్రైవేటు సంస్థలకు కట్టబెట్టేందుకు రంగం సిద్ధం చేసింది. ఇప్పటికే ఆర్టీసీ యాజమాన్యం టెండర్ నోటిఫికేషన్ విడుదల చేయగా, దీని ప్రకారం గ్రేటర్‌లో 39 ఎకరాలను ధారాదత్తం చేసేందుకు కార్యాచరణ అమలైంది. నోటిఫికేషన్‌లో పేర్కొన్నట్లుగా గ్రేటర్ హైదరాబాద్ ఆర్టీసీ జోన్ పరిధిలోని కాచిగూడ, మేడ్చల్, శామీర్‌పేట, హకీంపేట, చెంగిచెర్ల, రహీద్‌గూడ 1 అండ్ 2, తుర్కంయాంజల్ 1 అండ్ 2 ప్రాంతాల్లోని మొత్తం 39 ఎకరాల విస్తీర్ణంలో ఆర్టీసీ భూములను లీజు ప్రాతిపదికన అప్పగించనున్నారు. మార్చి 15 సాయంత్రం 4గంటల వరకు ఆన్‌లైన్ ద్వారా టెండర్ దరఖాస్తు చేసుకోవడానికి వీలు కల్పించారు.



సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యేలు గాంధీ, మర్రి రాజశేఖర్‌రెడ్డి, ఎమ్మెల్సీలు సురభి వాణీదేవి, నవీన్‌కుమార్, ప్రభాకర్, డిప్యూటీ మేయర్ శ్రీలతా శోభన్‌రెడ్డి తదితరులు

## అధికారులు నిర్లక్ష్యం చేస్తే..

# సరెండర్ చేయండి

## కమిషనర్‌కు మేయర్ ఆదేశం

అడ్వర్టయిజ్‌మెంట్ విధానాల్లో లోపాలపై సభ్యుల అభ్యంతరం

ప్రకటనలపై పూర్తి నివేదిక కోరిన మేయర్

జోనల్ సమీక్షల తీరుపై ఆగ్రహం

బల్దియాలో వాడివేడిగా సర్వసభ్య సమావేశం

నేడూ కొనసాగనున్న కౌన్సిల్, బడ్జెట్‌పై చర్చ

సిటీబ్యూరో, ఫిబ్రవరి 19 (నమస్తే తెలంగాణ) : జీహెచ్‌ఎంసీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అధ్యక్షతన సోమవారం జరిగిన సర్వసభ్య సమావేశం వాడివేడిగా సాగింది. తొలుత మాజీ ప్రధాని పీవీ నర్సింహారావుకు భారతరత్న ప్రకటించినందుకు కేంద్ర ప్రభుత్వానికి అన్ని పార్టీల సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. ప్రశ్నోత్తరాల సందర్భంగా తొలుత బీజేపీ కార్పొరేటర్ శ్రవణ్ డిప్యూటేషన్లపై, స్ట్రీట్ లైట్ల నిర్వహణపై ఎంఐఎం కార్పొరేటర్ మిర్జాముస్తక్ బేగ్, అడ్వర్టయిజ్‌మెంట్ అవినీతి, అక్రమాలపై బీజేపీ కార్పొరేటర్ వంగా మధుసూదన్‌రెడ్డి, కోచ్ నియామకం, స్పోర్ట్స్ అంశాలపై సయ్యద్ సోహైల్ ఖాద్రిలు సభలో ప్రశ్నించారు. ముఖ్యంగా జీహెచ్‌ఎంసీలో డిప్యూటేషన్ల దుబారా, అడ్వర్టయిజ్‌మెంట్ విభాగం అక్రమాలు, వీధి దీపాల నిర్వహణలపై తీవ్రస్థాయిలో అధికారుల లోపాలను సభ్యులు ఎండగట్టారు. అడ్వర్టయిజ్‌మెంట్ పాలసీ, హోర్డింగ్‌ల విధానం, ప్రకటనల్లో కార్పొరేషన్‌కు రావాల్సిన ఆదాయం రావడం లేదని, పక్కదారి పడుతున్నదని, కోట్లాది రూపాయల స్కాం జరుగుతున్నదని, కేవలం రెండు ఏజెన్సీలు లీడ్ స్పేస్, ప్రకాశ్ యాడ్స్ కంపెనీల గుత్తాధిపత్యంలో జీహెచ్‌ఎంసీకి భారీగా ఆదాయం గండిపడుతున్నదని తక్షణం చర్యలు తీసుకోవాలని అన్ని పార్టీల సభ్యులు స్పష్టం చేశారు. ఈవీడీఎంలో ఇద్దరు అధికారులు కార్తిక్, అజయ్‌లపై తీవ్రస్థాయిలో సభ్యులు ఆరోపణలు చేశారు. 2017 నుంచి జీహెచ్‌ఎంసీలో కొత్తగా 'కార్తిక్' ట్యాక్స్ చెలామణి అవుతున్నదని వంగా మధుసూదన్ రెడ్డి ఆరోపించారు. మెట్రో పిల్లర్ ప్రకటనలపై ఆయనకు ప్రత్యేకంగా ట్యాక్స్ వెళ్తున్నదని, మెట్రో, మాల్స్, పెద్ద భవనాలు, డిజిటల్ బోర్డుపై అక్రమ వసూళ్లు జరుగుతున్నాయని ఆరోపించారు. దీనిపై సెంట్రల్ విజిలెన్స్‌కు ఫిర్యాదు చేయబోతున్నట్లు తెలిపారు. అక్రమ హోర్డింగ్స్‌పై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కార్పొరేటర్లు, ఎమ్మెల్సీలు మేయర్‌ను కోరగా, అన్ని పార్టీలతో కలిసి ఒక కమిటీని ఏర్పాటు చేసి పూర్తి స్థాయిలో విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కమిషనర్‌ను ఆదేశించారు. రెగ్యులర్ అడ్వర్టయిజ్‌మెంట్‌కు సంబంధించిన ఒక విచారణ అధికారిని నియమించి, విచారణ చేసి.. నివేదిక సమర్పించాలన్నారు. త్వరలో హోర్డింగ్స్, ఎల్‌ఈడీ స్క్రీన్లపై కొత్త పాలసీ రానున్నదని ఈవీడీఎం డైరెక్టర్ ప్రకాశ్‌రెడ్డి తెలిపారు. కాగా, మంగళవారం ఉదయం ప్రశ్నోత్తరాలు, మధ్యాహ్నం బడ్జెట్‌పై చర్చించి సభ ఆమోదం తెలపనున్నది.

### డిప్యూటేషన్లపై నియంత్రణేది?

ప్రశ్నోత్తరాల సమయంలో తొలుత మల్కాజిగిరి కార్పొరేటర్ శ్రవణ్ జీహెచ్‌ఎంసీలో ఎంత మంది ఉద్యోగులు ఔట్‌సోర్సింగ్, డిప్యూటేషన్‌పై వచ్చిన ఉద్యోగుల వివరాలపై చర్చించారు.డిప్యూటేషన్లపై జీహెచ్‌ఎంసీకి క్యూ కడుతున్నారని, చాలా మంది ఉన్నతాధికారులకు పనిలేకుండా ఉన్నారని శ్రవణ్ ఆరోపించారు. వైద్య ఆరోగ్యశాఖ నుంచి వచ్చి ఏండ్ల తరబడి ఒకేస్థానంలో అధికారులు పాతుకుపోయారని, పలుకుబడితో అధికారులు వందల కోట్ల అక్రమాలకు పాల్పడుతున్నారని, ఏండ్ల తరబడి ఉన్న అధికారులను పంపే విధంగా తీర్మానం చేయాలని శ్రవణ్ పట్టు పట్టారు. డిప్యూటేషన్ల పేరిట జరిగే దుబారాను అడ్డుకట్ట వేయాలని డిమాండ్ చేశారు. దీనిపై జీహెచ్‌ఎంసీ అడ్మిన్, కమిషనర్ సమాధానం ఇచ్చారు. జీహెచ్‌ఎంసీలో మొత్తం 9138 మంది ఉద్యోగులు ఉండగా..4603 రెగ్యులర్, 28, 763 ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు ఉన్నారని అడ్మిన్ సరోజ తెలిపారు. ఇతర శాఖలకు సంబంధించి 778 మంది జీహెచ్‌ఎంసీలో పనిచేస్తున్నారని, 45 మంది ఎక్స్‌టెన్షన్ (రిటైర్డ్ ఉద్యోగులు)పై కొనసాగుతున్నారని కమిషనర్ రోనాల్డ్‌రాస్ వెల్లడించారు.



మాట్లాడుతున్న మేయర్ గద్వాల్ విజయలక్ష్మి

### విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే..

జోనల్ సమీక్షలపై కార్పొరేటర్లు అభ్యంతరాలు వ్యక్తం చేసిన నేపథ్యంలో మేయర్ జోక్యం చేసుకొని అసలు సంబంధిత అధికారులు లేకుండా సమీక్షలు జరపడం ఏమిటని ప్రశ్నించారు. మేయర్ లేకుండా జోనల్ సమీక్షలు నిర్వహిస్తున్నారని, కార్పొరేటర్ల సమస్యలను పరిగణనలోకి ఎందుకు తీసుకోవడం లేదని మండిపడ్డారు. బల్దియా అభివృద్ధి కోసం పనిచేసే అధికారులే ఉండాలని.. విధుల్లో నిర్లక్ష్యంగా ఉండే వారిని ప్రభుత్వానికి సరెండర్ చేయాలని కమిషనర్‌కు మేయర్ ఆదేశాలు జారీ చేశారు. డిప్యూటీ కమిషనర్ల తీరు బాగా లేదని, నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. బడ్జెట్ తయారు చేసే సమయంలో కార్పొరేటర్ల ప్రతిపాదనలు పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు.

### వీధి లైట్ల నిర్వహణపై..

వీధి దీపాల నిర్వహణ ఏ మాత్రం బాగలేదంటూ సభ్యులు మండిపడ్డారు. నాలుగు నెలలుగా ఎలక్ట్రిసిటీ వ్యవస్థ కుప్పకూలిందని, కనీసం పునరుద్ధరణ వ్యవస్థ లేదని ఎమ్మెల్యే గాంధీ ఆరోపించారు. ఒక లక్ష రూపాయలు మంజూరు చేయలేనప్పుడు, ప్యాచ్ వర్క్ పనిచేసే పరిస్థితి లేనప్పుడు ఐఏఎస్ అధికారులు ఉండి ఏం లాభమని మండిపడ్డారు. పార్టీలకు అతీతంగా సభ్యులు వీధి దీపాలు సరిగా వెలగడం లేదని, కొన్ని చోట్ల 24 గంటలు వెలుగుతున్నాయని, లైట్స్ పెట్టిన వెంటనే పోతున్నాయని సభ దృష్టికి తీసుకొచ్చారు. ఎస్‌ఈ శ్రీనివాస్ (ఎలక్ట్రికల్) సమాధానంపై కార్పొరేటర్లు భగ్గుమన్నారు. కమిషనర్ రోనాల్డ్‌రాస్ సమాధానమిస్తూ..ఆటోమెటిక్ టైమర్ పెట్టుకున్నా.. 7వేల సీసీఎంఎస్ బాక్స్‌లు మ్యాన్యువల్‌గా ఆపరేట్ చేస్తున్నారని, కేబుల్ సమస్యను పరిష్కరిస్తామన్నారు. కాగా, ఉదయం 10.28 గంటలకు సభ ప్రారంభమవ్వగా, మధ్యాహ్నం 3.40 గంటలకు సభను మంగళవారానికి వాయిదా వేస్తున్నట్లు మేయర్ ప్రకటించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీలు నవీన్‌కుమార్, ప్రభాకర్, సురభి వాణీదేవి, మహమూద్ అలీ, గోరటి వెంకన్న, బల్మూరి వెంకట్, మహమ్మద్ మిరాజ్ బేగ్, ఎమ్మెల్యేలు బండారి లక్ష్మారెడ్డి, మీర్ జుల్ఫేకర్ అలీ, మహమ్మద్ మాజీద్ హుస్సేన్, మహ్మద్ ముబిన్, డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.




## నర్తనం.. నయనానందకరం

రవీంద్రభారతిలో సోమవారం నర్తనం నాట్య అకాడమీ ఆర్ట్స్ వార్షికోత్సవం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా నాట్యగురువు వర్షిణి శిష్యబృందం నృత్య ప్రదర్శన వీక్షకులను మంత్రముగ్ధులను చేసింది.

## సమాజాన్ని ప్రభావితం చేసేది రచయితలే

### బుక్ ఫెయిర్ ముగింపు సభలో మంత్రి పొన్నం ప్రభాకర్

కవాడిగూడ, ఫిబ్రవరి 19: సమాజాన్ని ప్రభావితం చేసేది రచయితలేనని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఈతరం సెల్‌ఫోన్లు, యూట్యూబ్‌లలో మునిగితేలుతున్నదని, వాటి నుంచి బయటపడాలంటే పుస్తక పఠనమే అందుకు సరైన మార్గమన్నారు. 'హైదరాబాద్ బుక్ ఫెయిర్' సోమవారం రాత్రి ఘనంగా ముగిసింది. ఈ సందర్భంగా జరిగిన ముగింపు సభకు మంత్రి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. తొలుత 10 ఏండ్ల నుంచి నిర్వహించిన బుక్ ఫెయిర్ ప్రస్థానానికి సంబంధించిన 'పుస్తకాల పండుగ' పుస్తకాన్ని ఆవిష్కరించారు. అనంతరం మంత్రి పొన్నం మాట్లాడుతూ సమాజంలోని విభిన్న అంతరాలు, అసమానతలు పోవాలంటే పుస్తకాలు ఒక మార్గదర్శకంగా ఉపయోగపడుతాయన్నారు. హైదరాబాద్ బుక్ ఫెయిర్ అధ్యక్షుడు జూలురు గౌరీశంకర్ అధ్యక్షతన వహించిన ఈ కార్యక్రమంలో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత శివారెడ్డి, ప్రొఫెసర్ రమామెల్కోటే, ఓయూ వీసీ డి. రవీందర్, భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు మామిడి హరికృష్ణ, బుక్ ఫెయిర్ కార్యదర్శి ఆర్, వాసు, ఉపాధ్యక్షుడు నారాయణరెడ్డి, కోయ చంద్రమోహన్, కోశాధికారి పి. రాజేశ్వర్ రావు, బుక్ ఫెయిర్ వ్యవస్థాపక అధ్యక్షుడు శృతికాంత్ భారతి, శోభన్ బాబు, జనార్ధన్‌గుప్తా, సూరిబాబు, బాల్ రెడ్డి, కవి యాకూబ్ తదితరులు పాల్గొన్నారు.





బుక్‌ఫెయిర్‌లో సందర్శకుల సందడి

## మనోడికే పోస్టింగ్..!

### కాదనుకున్నవారికి పాతాళం

రాజకీయ అండదండలుంటే.. నచ్చిన చోటికి బదిలీ

ఏసీపీ, సీఐ బదిలీల వ్యవహారంపై జోరుగా చర్చ

సిటీబ్యూరో, ఫిబ్రవరి 19 (నమస్తే తెలంగాణ): పోలీసు అధికారుల బదిలీల్లో తమ వారికి అందలం కాదనుకున్న వారికి పాతాళం.. అనే విధంగా రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధుల ఒత్తిళ్లతో ఉన్నతాధికారులు వ్యవహరిస్తున్నట్లు డిపార్ట్‌మెంట్‌లో చర్చ జరుగుతున్నది. ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్ల కోసం ఫోన్లలోనే అధికార పార్టీ నాయకులు తమకు కావాల్సిన వారిని ఎంచుకుంటున్నారని, ఇందుకు ఉన్నతాధికారులు ఒకే చెబుతూ.. చేసిన బదిలీలను కూడా రద్దు చేసి మరోసారి వారిని బదిలీ చేస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి.

### రెండు నెలల కిందట..

ట్రై పోలీస్ కమిషనరేట్ పరిధిలో రెండు నెలల కిందట నియమితులైన ఓ కమిషనర్.. పార్లమెంట్ ఎన్నికల నిబంధనలో భాగంగా బదిలీ అయ్యారు. కొందరు డీసీపీలను సైతం పోస్టింగ్ ఇచ్చిన నెల రోజుల్లోనే మార్చేశారు. ఇప్పుడు అదే తీరు ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్ల విషయంలోనూ కొనసాగుతున్నది. వచ్చిన పోస్టు ఉంటుందా? పోతుందా? అనే ఆందోళనలో కొందరు ఉంటే.. మరి కొందరు తనకు అనుకూలమైన పోస్టు రాలేదంటూ..ప్రజాప్రతినిధి మా వాడే.. అతనే అన్ని చూసుకుంటాడనే ధీమాలో ఉంటున్నారన్న టాక్ నడుస్తున్నది.

### ఏకంగా పోస్టింగ్‌లు రద్దు చేయించుకొని..

హైదరాబాద్, రాచకొండ, సైబరాబాద్ కమిషనరేట్ల పరిధిలో సీసీఎస్, సైబర్‌సెక్యూరిటీ బ్యూరోకు, ఎస్‌బీ, ట్రాఫిక్‌కు బదిలీ అయిన ఏసీపీ స్థాయి అధికారులు తిరిగి తమ పోస్టింగ్‌లు రద్దు చేయించుకొని.. ఇతర పోస్టులను రాబట్టుకున్న వారు చాలా మందే ఉన్నారు. కొందరైతే మొదటి నుంచి రెండో పోస్టింగ్.. మూడో పోస్టింగ్‌ను కూడా తెప్పించుకున్నారని.. మన వాళ్లు అనుకునే వాళ్లు రాజకీయాల్లో ఉంటేనే మంచి పోస్టింగ్ వస్తుందన్న చర్చ పోలీసు వర్గాల్లో ఉంది.

### అనుకూలమైన పోస్టింగులు..

గత నెలలో రాచకొండ పోలీస్ కమిషనరేట్ పరిధిలో బదిలీలు జరిగాయి. అప్పటి కమిషనర్.. మహేశ్వరం జోన్‌లోని ఓ ఇన్‌స్పెక్టర్‌ను నియమించారు. సదరు కమిషనర్ బదిలీ అయ్యే సమయానికి సదరు ఇన్‌స్పెక్టర్‌ను మల్టీజోన్-2 అంటూ.. హైదరాబాద్ కమిషనరేట్‌కు బదిలీ చేయగా ఆయనకు అక్కడి కమిషనర్ మరో ఠాణాలో డీఐగా పోస్టింగ్ ఇచ్చారు. భువనగిరి జోన్‌లో ఒక ఇన్‌స్పెక్టర్‌ను తమకు అనుకూలమైన వారిని మార్చాలంటూ.. లూప్‌లైన్‌లోకి వెళ్లిన ఇన్‌స్పెక్టర్‌ను తమ పరిధిలోని ఠాణాకు బదిలీ చేయించుకున్నారు. అధికార పార్టీతో అండదండలతోనే ఇప్పుడు పోలీసు శాఖలో పోస్టింగ్‌లు జరుగుతున్నాయని చర్చించుకుంటున్నారు. హైదరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో మలక్‌పేట, చాంద్రాయణగుట్ట ఏసీపీలు బదిలీ అయినా.. కొత్తగా వచ్చిన వారి పోస్టింగ్‌లను రద్దు చేసి తిరిగి అదే అధికారులను నియమించడంపై కూడా చర్చ జరుగుతున్నది.